## ఆశ వర్కర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫార్వీన్ కౌసర్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫార్వీన్ కౌసర్

సూర్యాపేట లీగల్, మే 20: ఆశ వర్కర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫార్వీన్ కౌసర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నిత్యం ప్రజల మధ్య ఉండే ఆశ వర్కర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ప్రజలకు చట్టపరమైన సమస్యలపై అనుమానాలను నివృత్తి చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.లింగయ్య, ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు జి.మధు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

- ఎంపీడీఓ ఆంజనేయులు



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

మోతె, మే 20: నర్సరీల్లో మొక్కల పెంపకం సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని బిక్య తండా గ్రామంలో హరిత హారం నర్సరీ, నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీలో మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని వన సేవకులను సూచించారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున మొక్కలకు సరిపడా నీరందించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

- ఎంఈఓ సలీంషరీఫ్



మాట్లాడుతున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, మే 20: విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతుల అంశాలను అవగాహన చేసుకొని ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ, రిసోర్స్ పర్సన్లు రవిచందర్, పద్మ, స్రవంతి, రామానాయక్, వేణుబాబు, పర్వీన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, మే 20: జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూర్యాపేట టౌన్-1 పరిధిలో బుధవారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఆర్.సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గిరినగర్, జమ్మిగడ్డ, బాలాజీనగర్, పీఎస్ఆర్ సెంటర్, కొత్తగూడెం బజార్, రాజీవ్‌నగర్, తులసమ్మ హోటల్, పూల సెంటర్, అలంకార్ టాకీస్ రోడ్డు, 60 ఫీట్ల రోడ్డు, హుబట్‌నగర్, చర్చి కంపౌండ్, జాకీర్ హుస్సేన్ నగర్, తిరుమల నగర్, భగత్‌సింగ్ నగర్, అంబేద్కర్ నగర్, చింతలచెరువు, అమ్మ గార్డెన్, శ్రీరామ్ నగర్, బాలాజీ నగర్, కుడకుడ రోడ్డు, ఖమ్మం రోడ్డు, విద్యానగర్, భూమిరెడ్డి హాస్పిటల్, రాజధాని టీస్టాల్, వెల్కమ్ టీస్టాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

**చిలుకూరు మండలంలో..**

చిలుకూరు: చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కొండాపురం ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 'కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి'



సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

సూర్యాపేట టౌన్, మే 20: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వీడనాడాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, గంట నాగయ్య, మట్టిపల్లి సైదులు అన్నారు. కేంద్రం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనం కోసం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. దీంతో కార్మికుల సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తుందని పేర్కొన్నారు. నిరసనలో ఆయా సంఘాల నాయకులు ఎం.రాంబాబు, సాయికుమార్, శివకృష్ణ, వీరయ్య, కస్తూరి, చామల అశోక్, షేక్ లతీఫ్, నిమ్మల ప్రభాకర్, ఎస్.రాఘవరెడ్డి, కునుకుంట్ల సైదులు, సామ నర్సిరెడ్డి, సూరారపు లక్ష్మణ్, పుల్లూరి సింహాద్రి, పులుసు సత్యం, జంపాల స్వరాజ్యం పాల్గొన్నారు.

## 'బీసీల ఉద్యమంతోనే కులగణనపై ముందడుగు'

సూర్యాపేట టౌన్, మే 20: దేశవ్యాప్తంగా బీసీలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టేందుకు ముందుకు వచ్చాయని, బీసీల ఐక్యతతోనే ఇది సాధ్యమైందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ వర్గానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, మేధావులంతా ఒక్క తాటిపైకి వచ్చి బీసీలు రాజ్యాధికారం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని, రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సహాయ కార్యదర్శి బాదె నర్సయ్య పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మద్దిరాల: కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మద్దిరాల, మే 20: కొనుగోలు కేంద్రాలకు లారీలు అందుబాటులో ఉంటాయని, కాబట్టి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రం మద్దిరాలలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని ఆరాదీశారు. మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ లారీల్లోని ధాన్యం బసాతలు త్వరగా దిగుమతి అయ్యేలా చూసుకోవాలని చెప్పారు. మిల్లర్లు ఏవైనా ఇబ్బందులకు గురిచేస్తే అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం ప్రసాద్, తాసీల్దార్ అమీన్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

**తుంగతుర్తిలో..**

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ తాసీల్దార్ దయానందం ఉన్నారు.

**రైస్ మిల్లు తనిఖీ**

పెన్‌పహాడ్: మాచారం గ్రామంలోని శ్రీ వెంకటసాయి రైస్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోవాలని సూచించారు. మిల్లు సామర్థ్యాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాలునాయక్ పాల్గొన్నారు.

## నేడు హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్, మే 20: రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం హుజూర్‌నగర్‌లో పర్యటించనున్నారు. పట్టణంలో నూతన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పనులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల కొత్త భవనం స్థల పరిశీలన చేపట్టనున్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో సమావేశంలో పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటనలో వెలువరించారు.

**చింతలపాలెం మండలంలో..**

చింతలపాలెం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం చింతలపాలెం మండలానికి రానున్నారు. మండలంలోని నక్కగూడెం గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించనున్నారు. అనంతరం బుగ్గమాధవరం చేరుకొని రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట తాసీల్దార్ సురేందర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## 22న వాహనాల వేలం

తుంగతుర్తి, మే 20: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన 20 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ 22న ఉదయం 10 గంటలకు తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.


## కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : కలెక్టర్

సూర్యాపేట, మే 20: జిల్లాలో కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో పాటు విత్తన డీలర్లతో నకిలీ విత్తనాల అమ్మకాలు, నివారణ చర్యలపై మంగళవారం జిల్లా సీడ్ టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున డీలర్లు రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మేవారిని గుర్తించాలని, వెంటనే కంట్రోల్ రూం నంబర్ 6281492368కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై పీడీ యాక్ట్ పెట్టాలని ఆదేశించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రోగ్రాంలో పాల్గొని ఫార్మర్ ఐడీని పొందాలని తెలిపారు. ఈ ఐడీ ద్వారా కేంద్ర ప్రభుత్వం పథకాలకు అర్హులవుతారని చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీహెచ్ఓ నాగయ్య, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి'

చిలుకూరు, మే 20: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ గురవయ్య అన్నారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తమ పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, జీహెచ్ఎం గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మికుల ప్రయోజనాలు కార్పొరేట్ శక్తులకు తాకట్టు'




నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మద్దిరాల, మే 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జాతీయ కార్మిక సంఘాలు జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మరికంటి ఉపేందర్, మాతంగి ఉప్పలయ్య, నాగెల్లి వెంకన్న, రాంపాక వెంకన్న, సతీశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

మేళ్లచెర్వు, మే 20: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఆయన అభిమానులు మేళ్లచెర్వులోని ఐడియల్ హైస్కూల్లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాల ల్యాబ్ మెడికల్ ఆఫీసర్ నజీర్ సమక్షంలో 25 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొగ్గవరపు గోపి, నితిన్‌సాయి, సాయి వివేక్, రాకేశ్, మధు, విజయ్, రాజేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం వితరణ



కళమ్మ కుటుంబానికి బియ్యం వితరణ చేస్తున్న తిరుమలరావు, బీఆర్ఎస్ నాయకులు

నూతనకల్, మే 20: మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన గాజుల కళమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు మంగళవారం పరామర్శించి క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సూచనల మేరకు గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తూముల వెంకటేశ్వరరావు, సంద జ్యోతి, గాజుల ఉపేందర్, గాజుల మల్లయ్య, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, భద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో అన్నదానం


సూర్యాపేట టౌన్, మే 20: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుర్ర సత్యనారాయణరెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆలేటి ఆటం వరల్డ్ అనాథ ఆశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్టికుంట్ల చింటు, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, అన్నపూర్ణపు నరేందర్, నాని, రవితేజ, షరీఫ్, రాజేశ్, శరత్, వంశీ, మహేశ్, మణికంఠ, రియాజ్, హర్ష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- మున్సిపల్ కమిషనర్ రమాదేవి

కోదాడ, మే 20: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. ఈ నెల 3,4 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఏక్విప్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోదాడకు చెందిన ఖ్యాతి స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన 12 మంది రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చగా మంగళవారం కోచ్ పాలడుగు ఖ్యాతితో పాటు కమిషనర్ వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్ఆర్‌కే.మూర్తి, మేకల వెంకట్రావు, మల్లికార్జున్‌రెడ్డి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఓరుగంటి కిట్టు కోచ్ శివ పాల్గొన్నారు.

## పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

చందంపేట(దేవరకొండ), మే 20 : పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటయ్య, చందునాయక్, నాగేశ్‌నాయక్, సంఘం నాయకులు లింగ య్య, అరుణాదేవి, అంజయ్య, శ్రీను, అబ్దు ల్ కలాం, రంజన్‌బేగ్, పున్న వెంకటేశ్, కొం డ్రపల్లి శ్రీను, కుంభం బాల్‌చందర్, కొండల్, బాల్‌రాం, బాషానాయక్, ఖాదర్‌బాబా, మోహన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఎంఈఓ చత్రునాయక్



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి, మే 20: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్ అన్నారు. గరిడేపల్లిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులకు 5 రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. శిక్షణ ద్వారా చక్కని బోధన మెళకువలు నేర్చుకొని జిల్లాలో గరిడేపల్లి మండలాన్ని విద్యలో ఆదర్శంగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, సువర్ణ, దయాకర్, వెంకటరెడ్డి, బాల సైదిరెడ్డి, చంద్రయ్య, హైమావతి, పద్మ, బాలస్వామి, సైదులు, రవినాయక్, శ్రీనివాసరాజు, లక్ష్మయ్య, శిరీష, సుజాత, పాపయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రాంబాబు, రాములు, అశోక్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కష్టజీవుల రాజ్య స్థాపనకు కృషి చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు , మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

నేరేడుచర్ల, మే 20: కష్టజీవుల రాజ్య స్థాపనే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు అర్పించే నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సుందరయ్య ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిరికొండ శ్రీను, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అనంతప్రకాశ్, నీలా రామ్మూర్తి, మర్రి నాగేశ్వర్‌రావు, శ్రీధర్, నాగసైదులు, ధనుంజయ పాల్గొన్నారు.

## 'నకిలీ డాక్టర్లపై కఠినంగా వ్యవహరించాలి'




సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

సూర్యాపేట టౌన్, మే 20: నకిలీ డాక్టర్లపై కఠినంగా వ్యవహరించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నకిలీ డాక్టర్ల మూలంగా ప్రజల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నకిలీ డాక్టర్ల నిర్వాకంతో నిండు ప్రాణాలు బలయ్యాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆసుపత్రుల రెన్యూవల్స్, డాక్టర్ల సర్టిఫికెట్లు పరిశీలించి అనుమతి ఇవ్వాల్సిన డీఎంహెచ్ఓ చూసీచూడనట్లు వ్యవహరించి అందరికీ వైద్యం చేసే అవకాశం ఇవ్వడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. వెంటనే అనుమతులు లేని ఆసుపత్రులను సీజ్ చేయాలని, డీఎంహెచ్ఓపై సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బండి రవి, జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేశ్, డివిజన్ నాయకుడు దుదిపాళ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్, మే 20: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా నిధులను వెంటనే మంజూరు చేయాలని, రైతులకు నాణ్యమైన ఎరువులను సరఫరా చేయాలని అన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, రమణ, గాంధీ పాల్గొన్నారు.

# ఇరుకు వంతెనతో ఇంకెన్నాళ్లు?

- శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన మర్రికుంట వంతెన
- కొత్తది నిర్మించాలని ప్రయాణికుల విజ్ఞప్తి



ఇరుకుగా ఉన్న మర్రికుంట వంతెన

గరిడేపల్లి, మే 20: మండలంలోని మర్రికుంట గ్రామంలో సుమారు 50 ఏండ్ల క్రితం నిర్మించిన వంతెన ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. అప్పటి అవసరాలకు తగినట్టుగా నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం పెరిగిన వాహనాలకు సరిపోవడం లేదు. వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గరిడేపల్లి నుంచి మిర్యాలగూడకు, సూర్యాపేటకు ఈ వంతెన మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే నీటి ప్రవాహం పెరిగి వంతెన ప్రమాద స్థితికి చేరుకుంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఎటువంటి స్పందన ఉండడం లేదని ప్రయాణికులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని, లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.


**వాహనాల రాకపోకలు పెరగడంతో..**

సుమారు 50 ఏండ్ల క్రితం నిర్మించబడినదిగా చెబుతున్న ఈ వంతెన అప్పట్లో ఉన్న వాహనాల రాకపోకలకు సరిపోతూ ఉండేది. ప్రస్తుతం భారీ వాహనాలు, ఆటోలు, బైకుల సంఖ్య పెరగడంతో ఈ వంతెన సరిపోవడం లేదు. ఇరుకైన వంతెనపై ఒకేసారి రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వంతెనపై రక్షణ చర్యలు లేకపోవడంతో ఒకవేళ వాహనాలు ప్రమాదవశాత్తు అదుపుతప్పితే నేరుగా కాల్వలో పడే ప్రమాదం ఉందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

**ఎన్నికల సమయంలోనే..**

ప్రతిసారి ఎన్నికల సమయంలోనే వంతెన నిర్మాణానికి వాగ్దానాలు చేస్తున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు ఎడెనిమిదేండ్ల క్రితం రూ.1.93 కోట్లు మంజూరైనా నేటి వరకు వంతెన నిర్మాణం చేపట్టలేదని, శిథిలావస్థలో ఉన్న వంతెనకు మోక్షం ఎప్పుడు దక్కుతుందోనని స్థానికులు వాపోతున్నారు.

**ఎప్పుడేం జరుగుతుందో..**



వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మర్రికుంట వంతెన నిర్మాణానికి గతంలో నిధులు మంజూరైనా నేటికీ కొత్తది నిర్మించికపోవడం బాధాకరం. వంతెన ఇరుకుగా ఉండి వాహనాలు పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

- షేక్ యాకూబ్, సీపీఎం మండల కార్యదర్శి